హస్త 'కళ కళ'

ఆకట్టుకుంటున్న అంతర్జాతీయ మేళా


మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ హస్తకళా మేళా ఆకట్టుకుంటోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. బెంగుళూరుకి చెందిన కళాకారులు తయారు చేసిన చెక్క విగ్రహాలు, వాల్ హ్యాంగింగ్, జ్యూట్ బ్యాగులు, బొమ్మలు, ఆర్టిఫీషియల్ జువెలరీ, వెదురు బుట్టలు, అద్దకం చీరలు, కలంకారీ, వెంకటగిరి, గద్వాల్, చద్దర్లు, మంగళగిరి నేత చీరలు అందుబాటులో ఉన్నాయి. కొండపల్లి బొమ్మలు, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాలకు చెందిన బ్రాస్ ఆర్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. దశావతారాలు, అష్టలక్ష్మి, గుర్రాలు, వివిధ రకాల గృహాలంకరణ ఉత్పత్తులు ఉన్నాయి. ధర రూ.1000 నుండి రూ. 5.5 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇక ఆగ్రా కళాకారులు మార్బుల్‌తో టీ ప్లేట్లు, గుర్రాలు, ఏనుగులు, వివిధ రకాల కళాత్మక ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. ఈ ఎగ్జిబిషన్ ఈనెల 31వ తేదీ వరకు కొనసాగనుంది.






ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు

మేళాలో భాగంగా ప్రతి రోజు యాంఫి థియేటర్‌లో సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భరత నాట్యం, కూచిపూడి, కథక్, సంగీత కచేరీ, ఒడిస్సీ, పేరిణీ నాట్యం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.







'శాంటా మారియా'కు ఉత్తమ డెలిగేషన్ అవార్డు



అవార్డు గెలుచుకున్న శాంటామారియా స్కూల్ విద్యార్థులు

చందానగర్: శేరిలింగంపల్లిలోని శాంటామారియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ డెలిగేషన్ అవార్డు గెలుచుకున్నారు. ఇటీవల మలేషియాలోని కౌలాలంపూర్‌లో 10 బి ఇంటర్నేషనల్ స్కూల్, సెటియా ఎకో పార్కులో నిర్వహించిన మొదటి ఇంటర్నేషనల్ స్కూల్స్ పార్టనర్‌షిప్ మోడల్ యునైటెడ్ నేషన్ (ఐఎస్పీఎంయూఎన్)లో ప్రతిష్టాత్మకమైన డెలిగేషన్ అవార్డు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ హేమలత సంజయ్ మాట్లాడుతూ ఈ ఈవెంట్‌లో సాంస్కృతిక మార్పిడి, ఆలోచనాత్మక సహకారంపై చర్చలు జరిగాయన్నారు. ప్రపంచ సమస్యలపై చర్చించడానికి, సాంస్కృతిక సంబంధాలను మెరుగుపరచడానికి ఇంటర్నేషనల్ స్కూల్స్ పార్టనర్‌షిప్ మోడల్ యునైటెడ్ నేషన్స్ మలేషియా-2024 విద్యార్థులకు ఒక వేదికను అందించిందన్నారు. ఈ గ్రాండ్ ఈవెంట్‌లో 70కి పైగా ఇంటర్నేషనల్ స్కూల్ పార్టనర్‌షిప్ స్కూళ్లకు చెందిన 250 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఇండియన్ ఇంజనీరింగ్ కాంగ్రెస్‌లో 'ఎస్కీ' స్టాల్


'ఎస్కీ' స్టాల్ గురించి మంత్రి అరూప్‌బిస్వాస్‌కు వివరిస్తున్న ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: దేశవ్యాప్తంగా 'ఎస్కీ' పనితీరు వివరిస్తామని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. కోల్‌కతాలో శుక్రవారం ప్రారంభమైన 39వ ఇండియన్ ఇంజనీరింగ్ కాంగ్రెస్‌లో 'ఎస్కీ' స్టాల్‌ను పశ్చిమబెంగాల్ విద్యుత్ శాఖ మంత్రి అరూప్ బిస్వాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామేశ్వరరావు ఫోన్‌లో వివరాలు అందజేశారు. జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమాలలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి 'ఎస్కీ'లో అందించే శిక్షణ, అందుబాటులోకి తీసుకొచ్చిన పీజీ, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, త్వరలో ప్రారంభించే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను వివరించడం జరుగుతుందన్నారు.

లక్డారంలో మెడికల్ క్యాంపు

పటాన్‌చెరు: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో లక్డారం ప్రభుత్వ జిల్లాపరిషత్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం హెల్త్‌క్యాంప్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు అమేధా ఆస్పత్రి వైద్యులు రాజేంద్ర ,రవిలు వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు అందజేశారు.అదేవిధంగా సాత్విక్ రూరల్ అండ్ యూత్ ఇంటిగ్రేటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గర్భిణులకు, రక్తహీనత ఉన్న విద్యార్థులకు ,వృద్దులకు పోషకాహారాన్ని ఉచితంగా సరఫరా చేశారు. కార్యక్రమంలో శ్రీ రాజమాత ఫౌండేషన్ నిర్వాహకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, జనం కోసం మనం ఫౌండేషన్ నిర్వాహకులు హరికృష్ణ, శశికళ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొ.భీమ్‌సింగ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ కేసులకు భయపడం'

రాయదుర్గం: అక్రమ కేసులకు ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు భయపడరని ఆ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా స్పష్టం చేశారు. ఖాజాగూడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సభ్యులను రాజకీయంగా ఎదుర్కొలేక కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని విమర్శించారు. కలిసి కట్టుగా ప్రభుత్వంపై పోరాడతామన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం

మోతీనగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారా హిల్స్ శాఖ, జెన్‌నెక్స్ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం గాయత్రినగర్‌లోని పాఠశాల ఆవరణలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కేల వెంకటరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు విద్యార్థులతో పాటు పరిసర ప్రాంత వాసులు అందరూ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నీటి బిల్లులు వెంటనే చెల్లించండి

మేనేజర్ ప్రశాంతి


డ్రైవ్‌లో పాల్గొన్న వాటర్‌వర్క్స్ మేనేజర్ ప్రశాంతి తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదరాబాద్ వాటర్‌వర్క్స్ భాగ్యనగర్ సెక్షన్ పరిధిలో పెండింగ్ వాటర్ బిల్లుల వసూలుకు శుక్రవారం డ్రైవ్ నిర్వహించారు. వన్ టైం సెటిల్‌మెంట్ గడువు నవంబర్ 30వ తేదీన ముగిసినందున వాటర్‌బిల్లు కలెక్షన్ స్పెషల్ డ్రైవ్ చేస్తున్నారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రశాంతి, సిబ్బంది కలిసి వాటర్ బిల్లులు చెల్లించని వాణిజ్య, గృహ వినియోగదారులను గుర్తించి కనెక్షన్లు కట్ చేస్తామని, పాత బకాయిలు ఉంటే వెంటనే చెల్లించాలని వినియోగదారులను అధికారులు కోరారు.

తాగునీరు వృథా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ కేసీఆర్‌నగర్‌లో తాగునీరు వృథాగా పోతోంది. గత మూడు రోజులుగా కేసీఆర్ కాలనీలోని సంపులో నుంచి నీరు పోతోందని స్థానికులు తెలిపారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు.



ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


నిథమ్‌లో.. వేడుకల్లో పాల్గొన్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్, ఫ్యాకల్టీ, విద్యార్థులు

రాయదుర్గం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని నిథమ్‌లో శుక్రవారం రాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిథమ్ విద్యార్థులు ఆటాపాట, నాటిక , శాంటా క్లాజ్ వేషధారణతో నిథమ్ ప్రాంగణం సందడిగా మారింది. అనంతరం నిథమ్‌లో తయారు చేసిన కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిథమ్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మిషెల్లీ జే ఫ్రాన్సిస్, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చందానగర్‌లో..

చందానగర్: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సురభి కాలనీ ఎంపీపీఎస్ పాఠశాల, ఆరంభ టౌన్‌షిప్‌లలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ఆచరించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీకళ, సందయ్యనగర్ అధ్యక్షులు బస్వరాజ్, ఆరంభ టౌన్‌షిప్ అధ్యక్షులు రవీంద్ర రాథోడ్, దీప, పాస్టర్ సువర్ణ రాజ్, డానియల్, జాషువా, అనురాగ్, కుటుంబరావు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి, ఎన్టీఆర్‌నగర్‌లోని బెతెల్ గాస్పల్ చర్చ్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లోని యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ వారు శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

● ఆనంద తాండవమాడే..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ చేనేత హస్తకళా మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో శుక్రవారం పర్ణిక మాన్య శిష్యబృందం సంగీత స్వరఝరి అందించారు. అట్లాంటా జార్జియా నుంచి వచ్చిన కూచిపూడి కళాకారిణి పుష్యమి లంక తన ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. ఆనంద తాండవమాడే, స్వాగతం కృష్ణ తదితర అంశాలను ప్రదర్శించారు. అలాగే నారాయణి నాట్యాలయ గురువు సంతోష్‌కుమార్ తమాంగ్ శిష్యబృందం పుష్పాంజలి, నటేశకౌతం, శబ్దం, కీర్తన, తుంగ తరంగ గంగే, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు.

కబ్జా చేశానని నిరూపిస్తే మీకే ఇచ్చేస్తా..

ఎమ్మెల్యే గాంధీ



ఆల్విన్‌కాలనీ: తాను కబ్జా చేసినట్టు నిరూపిస్తే ఆ స్థలాన్ని వారికే ఇచ్చేస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ ప్రతికలో తాను కబ్జా చేసినట్లు వచ్చిన కథనం అవాస్తవమని అన్నారు. తనకు నియోజకవర్గ అభివృద్ధి తప్ప మరే అంశంపై దృష్టి పెట్టాల్సిన అవసరం లేదన్నారు. మచ్చలేని మనిషిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. తనపై కావాలని బురద చల్లేందుకు ఎవరు ప్రయత్నించినా సహించబోనని అన్నారు. తాను 33 ఏళ్ల క్రితం భూమిని ప్రభుత్వ నిబంధనలకు లోబడి కొనుగోలు చేశానని వివరించారు.

కొనసాగుతున్న నిరసనలు


నిరసన తెలుపుతున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం

చందానగర్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం శేరిలింగంపల్లి కమిటీ ఆధ్వర్యంలో చందానగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరచడం అంటే దేశాన్ని అవమానించడమేనన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వై.వెంకటేష్, రాజు, సత్యం, శ్రీనివాసు, సీపీఎం నాయకులు శోభన్, కృష్ణ, వరుణ్, మాణిక్యం, కాంగ్రెస్ నాయకులు కవిరాజు, సూర్య పాల్గొన్నారు.

వైర్ తెగి కింద పడ్డ లిఫ్ట్

నలుగురికి గాయాలు.. గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందీప్ కుమావత్

గచ్చిబౌలి: వైర్ తెగడంతో ఉన్నట్టుండి లిఫ్ట్ కిందపడిపోవడంతో నలుగురు గాయపడ్డారు. గచ్చిబౌలి పీఎస్ ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్, బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరుకు చెందిన సందీప్ కుమావత్ (22) స్నేహితుడు హరికృష్ణ, మరో ఇద్దరు స్నేహితులతో కలిసి 19వ తేదీ రాత్రి 1.18 గంటల సమయంలో గచ్చిబౌలి డీఎల్ఎఫ్ రోడ్డులోని క్లౌడ్ కిచెన్ రెస్టారెంట్‌కు వెళ్లారు. ఆరో అంతస్తుకు వెళుతుండగా ఐదో అంతస్తులో మరి కొంతమంది లిఫ్ట్‌లోకి ఎక్కారు. దీంతో వైర్ తెగి ఒక్కసారిగా లిఫ్ట్ కింద పడిపోయింది. దీంతో సందీప్ కుడి కాలు ఫ్రాక్చర్ కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. లిఫ్ట్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని బాధితుని తండ్రి గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం చిన్న కంజర్ల గ్రామంలోని మహాత్మ జ్యోతిబా పూలే వసతి గృహంను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాలలో ఆహార పదార్థాలను, బియ్యంను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పెడుతున్న భోజనంపై ఆరా తీశారు. బాత్‌రూమ్‌లను శుభ్రంగా ఉంచాలని సూచించారు.


ఇంద్రేశంలో సర్వే పరిశీలన...

పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పటాన్‌చెరు మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్ పరిశీలించారు.

కాంగ్రెస్ నాయకుల సమావేశం

చందానగర్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశాన్ని అవమానించడమేనని రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్ అన్నారు. శుక్రవారం చందానగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ తన ఆలోచన ధోరణి మార్చుకోకపోతే ప్రజలు కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్లకు జరిమానా

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు లోపల వాక్‌వే నుంచి నిషేధిత వన్యప్రాణుల జోన్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించిన ఇద్దరు వాకర్లకు కేబీఆర్ పార్కు అధికారులు జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే... కేబీఆర్ పార్కు వాక్‌వే నుంచి వాచ్‌టవర్ వైపు ఎవరూ వెళ్లకుండా గేటుతోపాటు కంచెను కూడా ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం వాకింగ్ సమయంలో ఇద్దరు వ్యక్తులు గేటు పక్కన ఉన్న మొక్కలను తొక్కుకుంటూ వాకింగ్ కోసం వాచ్‌టవర్ వైపు వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన పార్కు అధికారులు ఆ ఇద్దరినీ పట్టుకొని వన్యప్రాణి హక్కుల చట్టం కింద జరిమానా విధించినట్లు సమాచారం. వాకర్లు, సందర్శకులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే తిరగాలని పలు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ కొంత మంది పరిధులు దాటి ప్రవర్తించడం వల్ల పార్కులో పక్షులు, పాములకు ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు తెలిపారు. వైల్డ్ లైఫ్ చట్టాన్ని ఎవ్వరూ ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని పార్కు రేంజ్ ఆఫీసర్ లక్ష్మీపతిరావు అన్నారు.

నేడు సర్కార్ బడుల్లో ఆహారోత్సవం

- తల్లుల చేత పోషక వంటకాలు..!
- అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు చేసిన ఉపాధ్యాయులు



బంజారాహిల్స్: విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతినెలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ప్రతినెలలో మూడో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశమై విద్యార్థుల పురోగతి, చేపడుతున్న కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21 (నేడు)న తెలంగాణ ఆహారోత్సవం పేరిట శనివారం అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు సర్కార్ బడులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమ వివరాల పట్టికను కూడా అందజేశారు. ఇందుకు మార్గదర్శకాలను అనుసరించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చేసే వంటకాలను పదిమందితో పంచుకునే అవకాశం కల్పించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలవనున్నది. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్ నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్ తదితర డివిజన్ల పరిధిలోని 17 ప్రభుత్వోన్నత, 47 ప్రాథమిక పాఠశాలల్లో తెలంగాణ ఆహారోత్సవం పేరిట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి ఆహ్వాన పత్రికను విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలా పంపించాలో కూడా అధికారులు సంబంధిత కరపత్రాన్ని ఆయా పాఠశాలలకు పంపించారు.

ఇదీ ఉద్దేశం..

అందుబాటులో ఉండే పౌష్టికాహారం పండ్లు, కూరగాయలు వంటి పోషకాహారాన్ని విద్యార్థులకు ఎలా అందించవచ్చో ప్రచార పత్రికల సహాయంతో తల్లిదండ్రులు, విద్యార్థులకు పరిచయం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు తెచ్చిన ఆహారం ప్రత్యేకత, ఉపయోగించిన పదార్థాలు, తయారీ విధానం, పోషక విలువలు గురించి తల్లిదండ్రులు వివరించేలా ప్రణాళికలు రూపొందించారు. అంతే కాకుండా ఇందులో పాల్గొనే వారందరూ ప్రశ్నలు, జవాబుల రూపంలో పోషకాహార వంటల విశేషాలను పంచుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 21న జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొనేలా తేదీ, సమయాన్ని సూచిస్తూ వారికి ఆహ్వానాలు పంపించారు. ఇప్పటి వరకు జరిగిన సమావేశాలకు రాని వారిని గుర్తించి తప్పక హాజరయ్యేలా చూడాలని సూచించారు. పోషక విలువలతో కూడిన ఒక వంటకాన్ని చేసి పాఠశాలకు తీసుకురండి.. పౌష్టికాహారం గురించి మాట్లాడండి..తెలుసుకోండి..అంటూ ఇందులో ప్రత్యేకంగా పొందుపర్చారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోజువారీ ఆహారంలో ఇవన్నీ అందిస్తున్నారా?

ఆహారంలో పోషక విలువలు సమపాళ్లల్లో ఉన్నట్లయితే రోగ నిరోధక శక్తి పెరిగి పిల్లలు ఆరోగ్యకరమైన బాల్యాన్ని గడపగలుగుతారని స్థానికంగా లభించే ఆహారంలో కూడా ఎన్నో పోషక విలువలు ఉంటాయి . కాబట్టి తల్లిదండ్రులు వాటిని పిల్లలకు అందేలా చూడాల్సిన బాధ్యతను ఈ సమావేశంలో తెలియజేయనున్నారు. ముఖ్యంగా బియ్యం, గోధుమ, మొక్కజొన్న, జొన్న, సజ్జ, సగ్గుబియ్యం, బంగాళాదుంపలలో పిండి పదార్థాలు ఉంటాయని, వాటిని పిల్లలకు అందించాలని చెబుతున్నారు. అలాగే చిక్కుడు, బఠాణీలు, అలసంద, మొలకెత్తిన పెసలు, పప్పు ధాన్యాలు, శెనగలు, సోయాబీన్స్‌ను ఇవ్వాలని సూచించారు. పాలకూర, మెంతికూర, తోటకూర, మునగాకు,పండ్లు ఇలా అవసరమైన పది ఆహార విభాగాల పేరుతో ఒక చార్ట్‌ను రూపొందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జెపి కాలనీ, ముదిరాజ్ భవన్, శాంతినగర్ కాలనీలో జీహెచ్ఎంసీ డీజీఎం శివకుమార్‌తో కలిసి డ్రైనేజీ సమస్యలు పరిశీలించారు.అనంతరం అంబేద్కర్ కాలనీలోని ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేశారు. కార్మికులు ఎప్పటికప్పుడు మురుగు కాలువల్లో పూడికతీత తీయాలని సూచించారు.

గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధి శంషీగూడలోని ఈద్గాలో నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ ఉత్సవాల్లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ శుక్రవారం పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొన్నారు.